# అపరాజితుడు

నేనూ నామ్‌జోషి సరిగ్గా అదే సమయానికి అదే హోటల్లో కాఫీతాగడం అలవాటయింది. మేము హోటలుకు వెళ్ళే సమయంలో రష్ చాలా తక్కువ. అందులోనూ నేనొక మూల చూచుకొని కూర్చుంటాను. అక్కడినుండి మనకందరూ కనిపిస్తుంటారు కాని మనమెవ్వరికీ కన్పించము.ఆ హోటలుకు కన్నడ పత్రికలూ, మహారాష్ట్ర పత్రికలూ, ఉత్తరప్రదేశ్ కు చెందినది పత్రికలూ వస్తూవుంటాయి. నామ్‌జోషికి కన్నడమూ మహారాష్ట్రమూ రెండూవచ్చు - అందుకే ఆ పత్రికల్లోని ఏదో ఓ వార్త బాగాచదివి నాతో ఇక చర్చ మొదలుపెడతాడు. అది చూసేసరికి పుణ్యకాలం గంటా గడిచిపోతుంది. మళ్ళీ పోయి ఇద్దరమూ పని ప్రారంభిస్తాము- ఇదీ మా నిత్య కార్యక్రమాల్లో ఓక ప్రముఖమైన ఘట్టం.

ఆరోజుకూడా పన్నెండున్నర కాగానే స్కూలునుండి బయటపడి హోటలు ముఖంపట్టాను. నాకంటే ముందే జోషి తయారు. కాని అతని ముఖమెందుకో వాడి వుంది. ఏదో వ్యవహారం జరిగి వుంటుందని పోల్చుకున్నాను. లేకుంటే మలక్ పేట పందెపు గుర్రంలా ఉరకలు వేస్తూవుండే నామ్‌జోషి ఎన్నికల్లో డిపాజిట్ పోయిన మంత్రిలా ముఖం పెట్టడమా? ఆశ్చర్యం!! మొజంజాహి మార్కెట్‌వద్ద అధిక వేతనాలకై బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలోని భాగంగా లేవదీసిన ఊరేగింపు కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అతికష్టం మీద మేము మెల్లగా మా మురుగన్ కేఫ్ చేరుకున్నాము. ప్రొప్రయిటర్ వేలాయుధం కాష్‌ముందు కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు. మేలు మామూలు ఆసనాల నాక్రమించాము. "ఏం భాయ్ విశేషం?" జోషిని హిందీలో పలకరించాను-

"ఛ.ఛ- చచ్చినాసరే ఈ టీచర్ వుద్యోగంమటుకు చేయకూడదురా మూ."

నాపేరు రామచంద్ర. జోషి నన్ను రామూ అని పిలుస్తాడు. "చస్తే టీచర్ ఉద్యోగం ఏమిటి అసలే ఉద్యోగమూ ఇక చేయనక్కరలేదు - ఇంతకూ అసలేమైందేమిటి సంగతి?"

జోషీ ముఖ గగనంలో కోపరేఖలు, విషాదచిహ్నాలూ ఇంద్రధనుస్సులా వెల్లివిరిసాయి - నేనూ అతను చెప్పబోయేది ఆసక్తిగా వింటున్నాను.

'ఏం తెచ్చిపెట్టమంటారు సార్' సర్వర్ పిలుపు. మేమతన్ని పట్టించుకోనేలేదు. నా దృష్టి మొత్తమూ జోషీమీదే కేంద్రీకృతమై వుంది. సర్వర్ రెండు నీళ్ళగ్లాసులు తెచ్చిపెట్టి మేము మాట్లాడకపోవడంతో వెళ్ళిపోయాడు. జోషీ నావైపు చూస్తూ మెల్లగా మొదలుపెట్టాడు.

'చూడు రామూ - ఇవ్వాళ జరిగిన సంఘటన కనుక నీ జీవితంలో జరిగినట్లయితే నీవు ఆత్మహత్య చేసుకునేవాడివి - లేదా కనీసం హైదరాబాదు వదిలిపెట్టి అజ్ఞాతవాసానికి వెళ్ళిపోయేడివి .' జోషీ ఆగాడు. నాలో ఉత్సుకత ఇనుమడించింది. సాహిత్యం చాలా దురదృష్టం చేసుకొన్నది. లేకుంటే జోషీ రచయిత కాకపోవడమేమిటి?? తాను చెప్పబోయే ఒక చిన్న విషయానికే ఇంత సస్పెన్సూ, టెంపో సృష్టిస్నాడు ముందుగానే. రచయితే అయివుంటేనా- ఓ హ్! నాలో నిజంగా ఆసక్తి కట్టలుతెంచుకొని ప్రవహించింది. గుడ్లు మిటకరించుకొని కదలకుండా కూర్చొని అతను చెప్పేది వింటున్నాను. అంత ఆత్మహత్య చేసుకోదగ్గ విషయమేమిటి జరిగింది? ఏమిటది??- "ఇది కాఫియా - వేడిసీళ్ళా?" సర్వర్ ముఖాన కొట్టాడు కాఫీని ఓ పెద్దమనిషి ఆవతల. అయితే అణుమాత్రం కూడా చలించకుండా కాఫీయడు కాని సర్వర్ మళ్ళీ వచ్చి నిలబడ్డాడు

మాముందు ఇప్పుడుకాదుపో 'అని అతన్ని అవతలికి తరిమి నేను కథలో లీనమైనాను. నిజమే! అర్డరిచ్చే తీరిక కూడా లేదిప్పుడు. ముందా జోషీ కథనం వినాలి. తినాలి. తర్వాతే తినాలి.

జోషీ మొదలుపెట్టాడు "చూడురామూ ఇవ్వాళ జీవితంలో నేనుచాలా పెద్ద పరాజయజయం పొందాను. లోగడ ఏనాడూ నా ఇరవైయేళ్ళ ఉపాధ్యాయజీవితంలో ఇంతఅవమానం పొందలేదు. ఆ స్కూలు నాకళ్ళఎదుట పుట్టింది-ఇందులో తొలిపాఠం చెప్పిన ఉపాధ్యాయుణ్ణి నేను. ఇటుకమీద ఇటుకపెట్టిభవనం కట్టినట్లు రోజు తర్వాత నెల తర్వాత నెల సంవత్సరంతర్వాత సంవత్సరం అలా పాఠాలు చెపుతూ ఈ పాఠశాలను ఎలిమెంటరీ స్కూలునుండి మల్టీపర్పస్ స్కూలు వరకు మార్చాను-నాకళ్ళ ఎదుట ఎన్నో రాజ్యాలు మారాలు-నిజాంపాలన-పోలీసుచర్య

తెలంగాణా రాజ్యం, ఆంధ్రప్రదేశ్ అవతరణ, అన్నీ ఇలా సినిమారీళ్ళలాగా తిరిగాయి- బిషప్ జాకబ్, అబ్దుల్‌రహమాన్, సంగనామాల నరసింహాచార్యులు, వరుసగా నాకళ్ళ ఎదుట ఇందరు హెడ్‌మాస్టర్లు మారారు. నేను మాత్రం అలాగే స్కూలులోని నల్లబల్లలాగా కదలకుండా స్థాణువై వుండి పాఠంతర్వాత పాఠం చెపుతూ బాచ్ తర్వాత బాచ్‌ని పంపుతూ ఎదుగూ బొదుగూ లేకుండా అలా స్కూలుకు అంటి పెట్టుకొని జీవిస్తూవున్నాను. నా విద్యార్థులు ఈనాడు బ్యాంకు మేనేజర్లూ ఐ.ఎ.యస్. ఆఫీసర్లూ కూడా అయినారు - మొన్న నియమింబడ్డ ఉపమంత్రికూడా నా విద్యార్థే - నేను కన్పడితే 'సారూ...' అంటూ నమస్కారం పెడతాడు ఈనాటికీ - అలాంటిది ఇన్నాళ్ళకు ఇన్నేళ్ళకు ఛీ - ఇంక బతికేమిటీ చచ్చేమిటీ ..' నిట్టూర్చి కొంచెం ఆగాడు నామ్ జోషి.

నేను ఊపిరి బిగబట్టి వింటున్నాను - అసలు కథ ఇక రాబోతున్నదన్న మాట.

'సార్ - దోసె చెప్పనా. మురుకులు చెప్పనా' సర్వర్ పిలుపు. తలెత్తి చూచాను. సర్వర్ అలాగే నిలబడి వున్నాడు ఇంతసేపటినుంచీ - పనిచేసే యంత్రంలావున్నాడు కాఫీమరకలతో కుప్పుస్వామి. 'ఒకకాఫీ ఫిఫ్టీ పట్రాపొమ్మని సర్వరును వదిలించుకొని ఇంతకూ ఏమైంది నామ్‌జోషీ' అన్నాను అదుర్దాగా. ఆ మధ్య కొంత కాలంనుండీ ప్రిన్స్‌పాలుకూ నామ్‌జోషీకీ మధ్య వచ్చుగడ్డి వేస్తే భగ్గుమంటున్నట్లు నాకూ తెలిసిన విషయమే!

నామ్ జోషి ఒక్క క్షణం ఆగి అటూ ఇటూ చూచి నాటకీయంగా ముఖ భంగిమలు మార్చి అసలు విషయం చెప్పాడు.దాని సారాంశం ఇది. నామ్‌జోషీ క్లాసులో వెనుక బెంచీలో ఒక స్టూడెంటు కూర్చొని సైకిలు దీపమంత చిన్న ట్రాన్సిస్టరు పెట్టుకొని క్రికెట్ రన్నింగ్ కామెంటరీ వింటున్నాడట-అది జోషీ పసికట్టి వాణ్ణి క్లాసునుండి బయటకు పొమ్మన్నాడట. ఆ పిల్లవాడు 'నేను పోను- అవసరమైతే నీవే పొ'మ్మన్నాడట-దానితో జోషీకి కోపంవచ్చి వాణ్ణి మెడబట్టుకొని బయటకు గెంటివేసి మళ్ళీ పాఠం చెప్పుకుంటూ పోయాడట. ఆ పిల్లవాడు నేరుగా పోయి వాళ్ళనాన్నకు జోషీమీద రిపోర్టుచేశాడుట. ఆ పెద్దమనిషి హైదరాబాదులో ఒ పెద్ద బిజినెస్ మాగ్నెట్. కేంద్రమంత్రివర్గం స్థాయిలో పలుకుబడి వున్న రాజకీయవేత్త-తనంత పెద్దమనిషి కొడుకును ఆఫ్టర్‌ఆల్ ఓ బడిపంతులు

బయటకు నెట్టివేశాడంటే తనకెంత షేం? తనవంశానికెంత కళంకం? వెంటనే స్వయంగా తన రోల్స్‌రాయిస్ మీద ప్రిన్స్‌పాల్ దగ్గరికి వచ్చాడు. ప్రిన్స్‌పాల్ ఆయన్ని చూస్తూనే వణికిపోయాడట. ఆ వచ్చిన మనిషెంతక్కువవాడా? తలచుకుంటే స్కూలు భవనాన్నే పునాదితోసహా పీకించి హుస్సేన్‌సాగర్‌లో పారేయించగలడు 'మీ స్కూల్లోని నాం జోషి అనే పంతులు మావాణ్ణి అవమానించాడట వెంటనే క్షమాపణ కోరుకోమని చెప్పండి' అని కోరాడట ఆ పెద్ద మనిషి. ప్రిన్స్‌పాల్ 'ఎవరిని క్షమాపణ కోరుకోవాలి! మిమ్మల్నా నన్నా' అని కూడా ప్రశ్నించకుండా నేరుగా నౌకరుచేత తన్ను పిలిపించి 'జోషి ఆ పిల్లవాడు వినోద్‌కుమార్‌ను క్షమాపణ కోరుకో' అన్నాడట....... ఇదీసంగతి.ఇంత ఇంతవరకు చెప్పినామ్ జోషి ఇక చెప్పలేకపోయాడు-కంఠం రుద్ధమైది-కళ్ళు చెమ్మగిల్లాయికూడాను-నేనూస్థాణువునైపోయాను.

సర్వర్ కాఫీ తెచ్చి టేబిల్ మీద పెట్టాడు.

నిజంగా ఎంతపని జరిగింది!!

ఇది వ్యక్తిగతంగా నామ్‌జోషికి జరిగిన అవమానం కాదు-ఉపాధ్యాయ కులానికే జరిగిన పరాభవం-వేడివేడికాఫీ చప్పరిస్తున్నకొద్దీ మాలో ఉద్రేకం పెరగ సాగింది. కాఫీ పొగలు విరజిమ్ముతున్నది.

ఆ పొగలు వాడిగా వేడిగా వున్నాయి.

పగను తీర్చుకోమంటున్న పొగలు.

ప్రతీకారాన్ని కోరుతున్న పొగలు-

ప్రిన్స్‌పాల్‌కు నామ్‌జోషి శక్తి తెలిసినట్లులేదు. జోషి అనామకుడైన స్కూలుటీచరని మాత్రమే అనుకోని వుంటాడు కాని ఆయన వెనుక మహారాణిగంజ్ మొత్తం వున్నది. జోషి గట్టిగా తలుచుకుంటే ప్రిన్స్‌పాల్‌ను ఆంధ్రప్రదేశ్ పొలిమేరలు దాటించి వేయగలడు-సరిగ్గా అదేమాట అన్నాడు జోషి. 'ఇప్పటివరకు మామధ్య కోల్డ్‌వార్ మాత్రమే జరుగుతున్నది-ఇవ్వాల్టితో వాడి పాపం బద్దలైంది. దిసీస్ ఏ బ్లెస్సింగ్ ఇన్ డిస్ గైజ్ చూడిక-నాతడాకా-స్కూలును స్తంభింపజేస్తాను విద్యార్థులంతా సమ్మెచేయ్యాల్సిందే నిరవధిక సమ్మె-ప్రిన్స్‌పాల్ పోయేవరకూ నిరాహారదీక్ష-ప్రిన్స్‌పాల్ పరాజయం చూస్తేనే కాని ఈ దీక్ష విడువను.' జోషి ప్రతిజ్ఞ పట్టాడు.

నిజమే! నామ్‌జోషి అపరాజితుడు.

జీవితంలో ఎన్నడూ గట్టిగా సంకల్పించిన పనిలో ఓటమిని ఎరుగనివాడు నేడు నిజంగా భీష్మ ప్రతిజ్ఞ నేపట్టాడు. భీమ ప్రతిజ్ఞనే బూనాడు. కురుక్షేత్రం చూస్తేనే గాని ఇక పూరుకోడు ఇలా అనుకునేసరికి నాకు ఏదో భయంవేసింది.

'మరి పిల్లల చదువు .......'

'హైదరాబాద్... దానికి వాడు ఆ ప్రిన్సిపాలే బాధ్యత వహించాలి' జోషి తకీమని జవాబు చెప్పాడు.

'ఎద్దుల పోట్లాటలో లేగలు నలిగిపోతాయి.'

'తప్పదు మరి ధర్మయుద్ధంలో.'

'పొరిగింటికి పెట్టిన నిప్పు మనింటికికూడా రాకపోదు.'

జోషికి తీవ్రంగా కోపం వచ్చింది.

'అంటే నీ ఉద్దేశం ఏమిటి రామూ'గాండ్రించాడు.

'అబ్బే-నాకు ఏ ఉద్దేశమూ లేందే'జవాబుచెప్పాను.

'మరైతే ఆమాట ఎందుకన్నావ్.'

'ఏమాట .. నేనసలు మాట్లాడందే.'

జోషితల పైకెత్తి చూచాడు-ఇందాకటినుంచీ తన్ను ప్రశ్నిస్తున్నది సర్వర్ కుప్పుసామి అని అప్పటికిగాని తెలియలేదు. దాంతో జోషి మరీ మండిపడ్డాడు.

'కుప్పుసామీ నువు నోరుమూసుకో. అధిక ప్రసంగం'గట్టిగా మందలించాడు-

'నిజమే స్వామీ-క్షమించండి ఏదో ఊరుకోని నోరుకాబట్టి అన్నాను.'

'చాల్లేపో' అని కొరకొరా చూచాడు జోషి. ఆచూపులో 'నీకు అనవసరంగా చనువు ఇచ్చాను. అన్న భావం వుంది.'ఎంతటివాళ్ళను అంతట్లోనే వుంచవలసింది-పొరపాటయింది' అన్న విచారమూవుంది.

ఒకరకంగా అది వాస్తవంకూడాను.

గత ఆరునెలలనుండి కుప్పుసామి మాకు అదే సీటులో అదేటైములో సర్వుచేస్తున్నాడు. అతని చేతిమీదుగా దోసెలూ, మురుకులూ, స్వీటులూ కాఫీలూ ఎన్నో స్వాహా చేశాము. మేము వెళ్ళే సమయంలో హోటల్లో బొత్తిగా రష్ లేక పోవడంతో కుప్పుసామి మాకెదురు సీట్లో కూర్చొని కబుర్లు చెవుతుంటాడు తీరికగా అంతర్జాతీయ రాజకీయాలనుండి హైదరాబాదు బాంకు ఉద్యోగుల సమ్మె వరకూ అన్నివిషయాలలో మాతోను భాగస్వామ్యం తీసుకుంటాడు-నిజంగా ఈ ప్రజాస్వామ్య ఫలితంగా ప్రతివాడికీ ప్రపంచజ్ఞానం పెరిగింది. రిక్షావాడు కూడా రష్యా-చైనా సంబంధాలగూర్చి చర్చిస్తున్నాడు.

నామ్‌జోషికి మాత్రం ఈవేళ నిజంగా కోపం వచ్చింది-అది సహజం కూడాను కారణమేమంటే ఇన్నాళ్ళ చర్చలూ లోకానికి సంబంధించినవి-ఈనాటి జోక్యం తన స్వవిషయంలో-అందులోనూ ఒక సర్వరు, తనకు ఇంత అవమానం జరిగినప్పుడు, నీతులు బోధించడం.

కుప్పుసామి నిజంగానే నీతులు బోధించడం మొదలుపెట్టాడు 'మీ మీ జయాపజయాల మధ్య జాతిని పాడుచేస్తున్నారు ఉపాధ్యాయుడికి సహనం అవసరం' ఈ మాట అని బిల్లుమా ముందుపడేసి మరీ పోయాడు కుప్పుసామి.

అప్పుడు నామ్‌జోషి ముఖం ఎలావుందో వర్ణించడానికి సామాన్య రచయితకు శక్తి చాలదు....మీకు సహనం అవసరమన్నమాటలో సత్యం వున్నా ఆమాట చెప్పే అర్హత ఈ సర్వరుకు లేదన్న భావంమాకు కల్గడంతో నిజంగానే అసహనంతో రెచ్చిపోయాము-'ఈ వెధవను హోటల్‌నుండి తరిమేస్తే సరి-' అన్నాడు నామ్‌జోషి....

'పోనీద్దూ పిచ్చికమీద బ్రహ్మాస్త్రం' అన్నాను నేను ఉన్న సమస్యగాక ఉపరి ఇదొకటెందుకన్న భావంతో.

'ఛ ఛో-రేపటినుంచీ ఈ హోటల్‌కు కాఫీకి రావద్దు'.

దానికి మాత్రం అంగీకరించాను నేను.

అలాగే మర్నాటినుంచే హోటల్ స్వప్నాలో కాఫీతాగడం మొదలు పెట్టాము

హోటల్‌ను మార్చాను కాని కొన్నాళ్ళవరకూ ఎందుకనో కుప్పుసామి చేతి కాఫీతోని ఆనందాన్ని మటుకు నేను పొందలేకపోయాను. 'ఆఁ-నీదంతా పిచ్చి-వట్టి సైకలాజికల్ వీక్‌నెస్-ఎవడిచేతితో ఇస్తేనేం? కాఫీలో రుచి మారుతుందా? "అన్నాడు జోషి-నిజమే! కాని రుచి కేవలం కాఫీలో లేదు-ఇచ్చేవాడి ఆప్యాయతలో కూడా వుందనిపించింది-

ఆ తర్వాత రెండురోజులకు ప్రొపయిటర్ వేలాయుధం బజార్లో కన్పించాడు. "ఏంసార్ కనపడటంలేదే ఈమధ్య" మామూలుగా పలకరింపుగా అన్నాడా మాట జోషికి అవకాశం చిక్కింది కుప్పుసామి తమ్ము అవమానపరచాడనీ అందుకని ఆ హోటల్ గుమ్మం తొక్కకూడదని నిశ్చయించామనీ చెప్పాడు ఖండితంగా జోషి. వేలాయుధం జరిగిన దానికి నొచ్చుకుంటున్నట్లు కన్పడ్డాడు. మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

"జోషి-పిచ్చికమీద బ్రహ్మాస్త్రం వేశావు".

"నీకు తెలియదు రామూ-చిన్నపామునైనా పెద్దకర్రతో కొట్టాలి"

ఔను! నాకేనేమిటి సామెతలు వచ్చు జోషి తక్కువా? మాటకుమాట-సామెతకు సామెత"జోషి నిజంగా అపరాజితుడు.

స్కూల్లో సమ్మె చేయించాడు. ప్రిన్స్‌పాల్‌ను ప్రశ్నార్థక స్థానంలో కమిటీ ముందు నిలబెట్టించాడు-

"నామ్ జోషి జిందాబాద్, ప్రిన్స్‌పాల్ ముర్దాబాద్...."

"హాయ్‌హాయ్ క్యాహువా ప్రిన్స్‌పాల్ మర్‌గయా."

నినాదాలతో పిల్లలు ఊరేగింపు లేవదీశారు. మూడు లారీల పోలీసులు, దుకాణాలన్నీ బంద్.

జోషి ఒక చిరునవ్వు నవ్వాడు నన్నుచూచి ఆ మధ్యాహ్నం. "పిల్లలు వినోద్‌కుమార్‌ను సమర్థించకుండా నామ్‌జోషిని బలపరచడం అంటే ఎంతవింత, చూడు నాపరాక్రమం అన్నట్లుంది ఆ నవ్వు. వెళ్ళి స్వప్నాలో కాఫీకి కూర్చున్నాము.

ఆశ్చర్యం!!

మాకెదురుగా కుప్పుసామి కూర్చొని చాయ్ తాగుతున్నాడు - ఓ బన్‌రొట్టె అందులో ముంచుకొని కొంచెం కొంచెం కొరుకుతున్నాడు-

గుడ్డలూ గడ్డమూ మాసి వున్నాయి....

అయినా ముఖంలో వెలుగు, మాటలో తేడా, అణుమాత్రం కూడా తగ్గ లేదు-

'హల్లో - రండి సార్ రండి ' మమ్మల్ని ఆప్యాయంగా స్నేహితుడిగా ఆహ్వానించాడు కుప్పుసామి-

ఏదో జరిగి వుంటుందని ఊహించాను.

కుప్పుసామి దగ్గరగా కూర్చోడానికి జోషి కొంచెం సంకోచిస్తున్నట్లు గమనించాను - ఏదో గిల్టీగా ఫీలవుతున్నాడు....

నేనే ముందు దారితీశాను-

'బాగున్నావా కుప్పుసామీ....'

'ఆ ఉన్నాను సార్ - మీ దయవల్ల.'

ఇదేమిటి వ్యాచ్యమా? వ్యంగ్యమా??

"ఇక్కడ చాయ్‌తాగుతున్నావు-"

నా ప్రశ్నకు సమాధానంగా నవ్వాడు కుప్పుస్వామి. ఆ నవ్వు చాలా బరువుగా వుంది.

ఒక్క క్షణం ఆగి అన్నాడు 'ఆఁ- ఆ అక్కడ పని మానేశానుసార్.'

మానేయ లేదు - వేలా యిధం తన హోటల్ ప్రిస్టేజికోసం క్రమశిక్షణ చర్య కింద కుప్పుసామిని మానుకోమనివుంటాడు - నేనిక ఏమీమాట్లాడ లేదు - మాట్లాడేందుకు మనస్కరించలేదు. సాహసించలేదు.

కాని కుప్పుసామిమాత్రం నవ్వుతూ మామూలుగానే కబుర్లు చెబుతున్నాడు హోటల్ పరిశ్రమలోని కష్టసుఖాలను గూర్చి. ఏక్లాసు హోటళ్ళల్లో అయితే జీతాలు డెబ్భైనుండి డెబ్భై అయిదు మధ్యలో వుంటాయట. అయితే టిప్స్ ఎక్కువగా దొరుకుతాయట- డ్రస్సు. ఇతర సౌకర్యాలూ బోనసులూ సర్వీసు రెగ్యులేషన్లూ అన్నీ వుంటాయిట ... బిక్లాసు హోటళ్ళల్లో కూడా జీతం అరవై నుండి డెబ్భై మధ్యలో వుంటుందిట కాని టిప్స్ దొరకదు ... నేను వింటున్నట్లు నటిస్తున్నానేకాని నిజానికి ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాను- ఇంత సంఘర్షణాత్మకమయిన జగత్తులో దిక్కు మొక్కులేని ఈ కుప్పుసామిలాంటివాళ్ళ బతుకులు ఎలా వెళ్ళుతాయి?? ఎవరు వాటిని ఆదుకుంటారు??

కాఫీ ముగించి బిల్లు తీసుకోని లేచాము-

మావెంటే కుప్పుసామి వచ్చాడు.

'ఎందాకా వెళ్తున్నాదు సార్.. '

'ఆబిడ్స్‌దాకా - జనరల్ పోస్టాఫీసు వరకు.'

'అయితే నా బండిలో ఎక్కండిసార్' కుప్పుసామి తన రిక్షాను చూపిచాడు వాకిట్లో.

'అక్కర్లేదులే నడిచిపోతాను-' అని ముందుకు సాగాము మేము- జోషి ఇదంతా చూచాడు కాని ఏమీ మాట్లాడలేదు.

'జోషి ఇక మురుగన్ హోటల్లోనే కాఫీ తాగుతాము రేపటి నుండి స్వప్నాలో ఏమీ బాగుండటంలేదు-'

జోషి నావైపు ఆదోలా చూచాడు. ఆ చూపులోని భావాలు వర్ణించడం చాలా కష్టం!!

కాలచక్రం గిర్రున తిరుగుతుంది.

ప్రితిపాల్ పై అవినీతి ఆరోపణలుకూడా సృష్టించబడ్డాయి. ఆయన గద్దెను దిగాడు - సీనియారిటీ ప్రకారమైతే జోషి ప్రిన్సిపాల్ కావలసిందే కాని నేనూ జోషి మెట్రిక్ తర్వాత ట్రైనింగ్ మాత్రం పాసైనాము. అందువల్ల మరొకరు ఆ స్థానంలోకి వచ్చారు. జోషి అపరాజితునిలా ఓ చిరునవ్వు నవ్వాడు మళ్ళీ - కేవలం అపరాజితుడే కాదు - విజేత కూడాను.

మేము మళ్ళీ మురుగన్ కేఫ్‌లో కాఫీతాగడం మొదలుపెట్టాను. ప్రతిరోజు అదేవేళ - అదోచోటు - అదే చేతన చక్రం.

అని ఏదో లోటు మాత్రం నాకు నాకు కన్పించింది. కొన్నాళ్ళవరకూ.... కాలం ఎవ్వరికోసం ఆగదుకదా!! క్రమంగా ఉన్న వాతావరణానికే అలవాటు పడ్డాము. ఇలా వుండగా ఒకనాడు మా అబ్బాయి ఫీజు ఫలానా బాంకులో కట్టి చలానా తీసుకోవాలని ఆదేశముండటంతో గన్‌ఫౌండ్రికి వెళ్ళాను. ఉదయం పది తర్వాత - చాలా రష్‌గా వుంది. నాకు కావలసిన కౌంటర్‌గూర్చి వాకబుచేశాను.' "ఇంకా ముందుకు సాగిపొండిసార్" ఎన్నడో విన్నట్లుంది ఈ గొంతు. తలెత్తి చూచాను - బిజీగా ఓ బాంకు ఉద్యోగి పనిచేస్తుకుంటున్నాడు.

ఫుల్ సూట్‌లో వున్నాడు. చేతికో ఖరీదైన ఉంగరం - వాచీ - మనిషిని తేలికగానే గుర్తుపట్టాను.

కాని కళ్ళను నేనే నమ్మలేకపోయాను.

కుప్పుసామికి అన్న దమ్ములెందరు? అతడు కవలపిల్లల్లో ఒకడా ??....

దిగ్భ్రాంతుణ్ణయి ఇంకా అలా చూస్తున్నాను.

ఆయన తలపైకెత్తి నావైపుచూచాడు 'ఓహో-మీదాసార్-బాగున్నారా....' పలకరించి మళ్ళీ తనపనిలో నిమగ్నమైపోయాడు - ఇక సందేహంలేదు.అతడు కుప్పుసామే! కాని అసలేం జరిగింది??

నిత్య జీవితంలో జరిగిందని చెపితే నమ్మలేని కథ. ఏ సినిమాల్లోనో నాటకీయంగా జరిగే కథ

నాకు తల తిరిగిపోయినట్లనిపించింది.

పని ముగించుకొని వెళ్ళి బాంకు మేనేజరును కలుసుకున్నాను - ఫలాని కౌంటర్‌దగ్గర వున్న వ్యక్తిని గూర్చి సమాచారం చెప్పవలసిందని కోరాను. మేనేజర్ అన్నాడు' ఆయన పేరు కుప్పుస్వామి - చాలా బుద్ధిమంతుడు. బి.కాం. పాసైనాడు ఇటీవలే అప్పాయింట్ అయినాడు - ఇచ్చిన ప్రతిపనీ చిన్నా పెద్దా తేడాలేకుండా శ్రద్ధగా చేస్తాడు.' మేనేజర్‌నుండి ఎప్పాయీకి ప్రశంస!!!

'మీకతనితో పనివుందా? బంధువా?'

'ఔను - ఆత్మబంధువు....' అని ఇక మాట్లాడకుండా బ్యాంకునుంచి బయటపడ్డాను సిగ్గుతో.